సాక్షి
వికారాబాద్
శనివారం । 9 । మార్చి । 2024



తాండూరు రూరల్: అంతారంతండాలోని భూకైలాస్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న గిరిజన మహిళలు



పరిగి: బసిరెడ్డిపల్లి కృష్ణగిరి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న స్వామీజీలు, భక్తులు

బ్రోవ రావా.. మహాదేవా..

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో శుక్రవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. పొద్దంతా ఉపవాస దీక్షలు ఆచరించిన మహిళలు, భక్తులు రాత్రి వేళ జాగరణ చేశారు.



తాండూరు టౌన్: పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయంలో..

న్యూస్‌రీల్

మహిళలకు ఉచిత శిక్షణ

వికారాబాద్ అర్బన్: యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు చిరు వ్యాపారాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సంచాలకులు జీ.ఎస్.ఆర్.కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చళ్లు, కారం పొడులు, తృణ ధాన్యాలతో స్నాక్స్ తయారు చేయడం వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఫోన్ నంబర్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. 10రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు బ్యాంక్ రుణం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు, పేర్ల నమోదుకు సెల్ నంబర్ నెంబర్: 93914 87797, 9177141712, 96185 34720, 6301890681లలో సంప్రదించాలన్నారు.

11న లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశం

ఆమనగల్లు: హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లోని ఏపీఆర్ గార్డెన్స్‌లో ఈనెల 11న లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశం నిర్వహించనున్నట్లు రీజియన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఆమనగల్లు లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ పాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, మల్టీపుల్ వైస్ చైర్మన్ జూలూరి రఘు తదితరులు హాజరవుతారని చెప్పారు. సమావేశానికి లయన్స్‌క్లబ్ రీజియన్ పరిధిలో ఉన్న పది లయన్స్‌క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

బైక్ ఢీకొని కొండగొర్రె మృతి

ధారూరు: బైక్ ఢీ కొనడంతో కొండగొర్రె మృతి చెందిన ఘటన మండలంలోని తాండూరు - హైదరాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. ధారూరు ఫారెస్టు డిప్యూటీ రేంజర్ జగన్‌మోహన, బీట్ ఆఫీసర్ నరేష్, ప్రత్యక్ష సాక్షులు కథనం మేరకు.. అనంతగిరి అటవీ ప్రాంతం నుంచి కొండగొర్రె రోడ్డుపైకి వచ్చింది. వాహనాల రాకపోకలకు భీతిల్లిన ధారూరు వైపు పరుగులు తీసింది. కొందరు యువకులు దాన్ని అనుసరిస్తూ వీడియోలు తీశారు. ధారూరు సమీపంలోని వంతెన రోడ్డులో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం బలంగా కొండగొర్రెను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలాన్ని ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఆనంద్ పరిశీలించారు. కొండగొర్రెకు 3 నుంచి 4 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. పశువైద్యులు పంచనామా నిర్వహించి సమీప అడవిలో దహనం చేసినట్లు డీఎఫ్‌ఆర్‌ఓ జగన్‌మోహన్ తెలిపారు.



కొండగొర్రె కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు ఆఫీసర్ ఆనంద్

స్కూల్ గ్రాంట్ అరకొరే..!

విద్యా సంవత్సరం ముగుస్తున్నా అందని నిధులు

- భారంగా మారిన పాఠశాలల నిర్వహణ
- ఇబ్బందుల్లో సిబ్బంది



వికారాబాద్ అర్బన్: విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ నిధులు మాత్రం అరకొరగానే విడుదలవుతున్నాయి. దీంతో స్కూళ్ల మెయింటెనెన్స్ ప్రధానోపాధ్యాయులకు భారంగా మారింది. నిబంధనల ప్రకారం పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే (మే లేదా జూన్ మొదటి వారంలో) స్కూల్ గ్రాంట్ ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేయాలి. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆగస్టులో మూడు నెలలకు సంబంధించిన బిల్లులు మాత్రమే వచ్చాయి. మరో ఆరు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. పాఠశాలలకు అవసరమైన స్టేషనరీ, చాక్ పీస్‌లు, డస్టర్లు, తాగునీరు, విద్యుత్ బిల్లులు, మరుగుదొడ్ల మరమ్మతులు వంటి వాటికి స్కూల్ గ్రాంట్‌నే వినియోగిస్తారు. ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు కాకపోవడంతో హెచ్‌ఎంలు వారి జీతాల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లాలో 764 ప్రాథమిక, 116 యూపీఎస్, 174 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 92,394మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదుల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్వశిక్ష అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ ద్వారా ప్రతి సంవత్సరం ఎస్‌ఎంసీ ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో 40మంది విద్యార్థులు మూడు తరగతి గదులు ఉంటే స్కూల్ గ్రాంట్ కింద రూ. 5వేలు, నిర్వాహణ ఖర్చుల కింద మరో రూ. 5 వేలు చెల్లిస్తారు. ఐదు గదుల కంటే ఎక్కువగా ఉంటే రూ. 5వేల నిర్వాహణ ఖర్చులు, రూ.10వేలు స్కూల్ గ్రాంట్ కింద అందజేస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ గ్రాంట్ కింద రూ. 7వేలు, నిర్వాహణ ఖర్చులకు రూ.10 వేలతో పాటు, ఇతర గ్రాంట్స్ కింద మరో రూ. 5వేలు ఇస్తారు. ఉన్నత పాఠశాలల్లో ల్యాబ్ నిర్వాహణ, రసాయనాల కొనుగోలు, సైన్స్ పరికరాల కొనుగోలుకు రూ. 20వేలు ఇస్తారు. బుక్స్, స్టేషనరీ కోసం రూ.7,500 కేటాయిస్తారు. మంచినీరు, విద్యుత్ బిల్లులు, టెలిఫోన్ బిల్లు, ఇంటర్‌నెట్ ఖర్చుల కోసం మరో రూ. 22వేలు ఇస్తారు. హైస్కూల్‌లో వంద శాతం ఎన్‌రోల్ మెంట్ ఉన్న పాఠశాలలకు మరో రూ. 50వేలు ఇస్తారు. ఇలా ఏటా సుమారు ఒక లక్ష రూపాయల గ్రాంట్ రావాల్సి ఉంటుంది.

నిర్వాహణకు సరిపోని నిధులు

ప్రభుత్వం పాఠశాల నిర్వాహణకు ఇస్తున్న నిధులు ఏమాత్రం సరిపోవడం లేదని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు పెరగడంతో పాఠశాల గ్రాంట్స్‌ను కూడా పెంచాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చాలా సంవత్సరాల క్రితం నిర్ణయించిన గ్రాంట్స్‌నే ప్రస్తుతం కొనసాగించడం ఇబ్బందిగా మారిందని అంటున్నారు. ఇచ్చే కొద్ది పాటి నిధులు సరిపోక, ఆ నిధులు సకాలంలో విడుదల కాక ఇబ్బందుల పాలవుతున్నామని అంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాంట్ రాకపోవడంతో నిర్వాహణ భారంగా మారిందని అంటున్నారు.

వేడుకలకు దూరం

ప్రతిఏటా పాఠశాలల్లో ఆయా విభాగాల్లో కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. గణతంత్ర దినోత్సవం, రాష్ట్ర అవతరణ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, బాలల దినోత్సవం, జాతీయ నాయకుల దినోత్సవాలు, మండల స్థాయి, పాఠశాల స్థాయి క్రీడలు, సైన్స్ ఫెయిర్ పరికరాల కొనుగోలు, క్రీడా సామగ్రి, విద్యుత్ బిల్లులు, పేపర్ బిల్లులకు స్కూల్ గ్రాంటే ఆధారం. ఆరు మాసాలుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం భారంగా మారిందని హెచ్‌ఎంలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాలల గ్రాంట్స్ పెంచడంతో పాటు, ప్రతి నెలా వచ్చేలా చూడాలని కోరుతున్నారు. గృహజ్యోతి కింద ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

త్వరలో గ్రాంట్ వస్తుంది



ఈ ఏడాది మొదట్లో మూడు నెలల గ్రాంట్స్ వచ్చాయి. మిగతా నిధులు రావాల్సి ఉంది. ఈ సమస్యను అడిషనల్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు హెచ్‌ఎంలు చేసిన ఖర్చు తిరిగి పొందవచ్చు.

– రేణుకాదేవి, డీఈఓ

స్పెషల్ డ్రైవ్ అంతంతే..

- నామమాత్రంగా ధరణి దరఖాస్తుల పరిష్కారం
- ఇప్పటి వరకు 3,622 మాత్రమే క్లియర్
- ఆశించిన స్థాయిలో ముందుకు సాగని ప్రక్రియ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఈ నెల 1 నుంచి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. మండలాల వారీగా తహసీల్దార్, డిప్యూటీ తహసిల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. మెజార్టీ దరఖాస్తులు నిషేధిత జాబితా, కోర్టు కేసులకు సంబంధించినవే కావడంతో అధికారులు వాటిని ముట్టుకునేందుకు సాహసించడం లేదు. దీంతో ఆయా దరఖాస్తులన్నీ పరిష్కారానికి నోచుకోలేక పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ధరణి పోర్టల్‌లో మొత్తం 39,076 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 3,622 మాత్రమే క్లియర్ చేశారు. మరో 35,454 దరఖాస్తులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన గడువు శనివారంతో ముగియనుంది. జిల్లా రెవెన్యూ అధికారులు వారం రోజులుగా ఇదే పనిగా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. రికార్డుల్లోని భూములకు.. క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు భిన్నంగా ఉండటంతో వీటిని ముట్టుకునేందుకు వెనుకాడుతున్నట్లు తెలిసింది. ఇక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 9,419 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 676 మాత్రమే పరిష్కరించారు. వికారాబాద్ జిల్లాలో 14,501 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో ఇప్పటి వరకు 4,324 దరఖాస్తులు పరిష్కరించారు. మెజార్టీ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు.

పత్రీజీ సేవలు చిరస్మరణీయం

- మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



పత్రీజీ శక్తిస్థల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న విజయభాస్కర్‌రెడ్డి, దశరథ్ నాయక్

కడ్తాల్: ధ్యానమయ ప్రపంచానికి ధ్యాన గురువు దివంగత బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం వారు మహేశ్వర మహాపిరమిడ్ ప్రాంగణంలో 'పత్రీజీ శక్తిస్థల్' నిర్మాణ పనులకు ధ్యానులతో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధ్యానానికి మారుపేరుగా నిలిచిన పత్రీజీ మనమధ్య లేకపోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. ధ్యానం ఉన్నంత వరకు పత్రీజీ మనతోనే ఉంటారని ధ్యాన జగత్తుకు పత్రీజీ చేసిన సేవలు ఎప్పటికి నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, పత్రీజీ కూతురు పరిమిళపత్రి, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, దామోదర్‌రెడ్డి, శ్రీరాంగోపాల్, చంద్రశేఖర్, మాధవి, నీరాజరెడ్డి, లక్ష్మీ, రమేశ్ తదితరులు ఉన్నారు.



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం

పైసలిస్తేనే ఫైలు కదిలేది

- ఆర్‌ఓఆర్, పహాణీలకు డబ్బు డిమాండ్
- ఆర్మీ జవాన్‌నూ వదలని కొందుర్గు రెవెన్యూ సిబ్బంది
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్

కొందుర్గు: పైసలు ఇస్తేనే ఫైలు ముందుకు కదిలేది అన్న చందంగా మారింది కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం పనితీరు. ఓ ఆర్మీ జవాన్ వద్దనే దర్జాగా డబ్బులు డిమాండ్ చేసిన రెవెన్యూ సిబ్బంది.. రైతులను ఎలా పీడిస్తారో అనుమానం అక్కర్లేదంటూ మండల వాసులు ఆరోపిస్తున్నారు. భూ సంబంధిత రికార్డులు, పహణీలు, ఆర్‌ఓఆర్ తదితర ధృవపత్రాలు కావాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలి. మీసేవలో చలాన్ కట్టాలి. వారం రోజుల్లో సదరు పత్రాలివ్వాలి. కానీ ఈ కార్యాలయంలో అటువంటి నిబంధనలు ఏవి ఉండవని.. అధికారులకు డబ్బులు ఇస్తే వెంటనే సదరు పత్రాలు ఇస్తారని చర్చించుకుంటున్నారు.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో రికార్డులు..

కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే రికార్డ్ అసిస్టెంట్ తరచూ షాద్‌నగర్ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయానికి వెళుతుంటాడు. ఇతనిపై ఆరా తీస్తే ఆర్‌డీఓ డ్రైవర్‌గా వెళ్లాడని ఇక్కడి అధికారులు చెబుతుంటారు. అయితే రికార్డు గదిలో కొందుర్గుకు చెందిన ఓ ఉద్యోగి రికార్డుకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలిస్తూ డబ్బు వసూలు చేస్తాడనే ఆరోపణలున్నాయి. ఆ డబ్బులు అధికారులు తీసుకుని పహాణీ, ఆర్‌ఓఆర్ తదితర రికార్డులు ఇస్తున్నట్లు సమాచారం.

తాజాగా రూ.40 వేలు డిమాండ్

విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి జనవరిలో తన భూమికి సంబంధించిన పహాణీ, ఆర్‌ఓఆర్ కావాలని జనవరిలో దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవలే తిరిగి కార్యాలయానికి వెళ్లి రికార్డు సెక్షన్‌లో ఆరా తీశారు. పేపర్లు ఇంకా సిద్ధమవ్వలేదని.. డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని సమాధానం ఇచ్చారని బాధిత రైతు ఆర్మీ పోలీసు అశోక్ రెడ్డి సెల్ఫీ వీడియో సోషల్ మిడియాలో వైరల్ అవుతోంది. హేమంత్ ఖాతాకు ఫోన్‌పే యాప్ ద్వారా రూ.9వేలు, కొంత నగదు ఇచ్చిన వీడియో చర్చనీయాంశంగా మారింది.

మహిళలను వెంటాడుతున్న అనారోగ్యం

- క్యాన్సర్, రక్త హీనత, థైరాయిడ్ వంటివే అధికం
- అవగాహన అవసరం అంటున్న వైద్యులు



మహిళా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న వైద్యులు

వికారాబాద్ అర్బన్: మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ ఇతర సమస్యల కారణంగా మహిళలు రోగాల బారిన పడుతున్నారు. జీవన శైలిలో మార్పు రావడం, స్ట్రెస్‌కు లోనవడం వంటి వాటితో పెద్ద జబ్బుల బారిన పడుతున్నారు. గత ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి ప్రభుత్వం మహిళా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో మొదటి విడతలో మూడు, రెండో విడతలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలో 8 కేంద్రాల ద్వారా ప్రతి మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 15,251 మందికి 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు రకాల వ్యాధులు ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణతో తేలింది. 10,719 మందికి మెరుగైన చికిత్స కోసం పెద్దాస్పత్రులకు రెఫర్ చేశారు.

చాపకింద నీరులా క్యాన్సర్ భూతం

ప్రధానంగా మహిళల్లో క్యాన్సర్ భూతం చాపకింద నీరులా విస్తరిస్తున్నట్లు వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మహిళా ఆరోగ్య కేంద్రాల్లో స్క్రీనింగ్ టెస్టుల చేయగా 182 మందికి రొమ్ము క్యాన్సర్, 63 మందికి నోటి క్యాన్సర్, 48 మందికి అంతర్గత అవయవాల్లో క్యాన్సర్ లక్షణాలు ఉండవచ్చనే అనుమానంతో జిల్లా ఆస్పత్రులకు రెఫర్ చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్న మహిళల్లో 30శాతం మందికి రక్త హీనత సమస్య ఉన్నట్లు గుర్తించారు. మరో 5శాతం మంది తీవ్ర రక్త హీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఇవే కాకుండా 746 మంది మహిళల్లో తీవ్ర క్యాల్షియం లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరిని కూడా జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. పాటు 874 మంది వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. వీరందరికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.

జీవన శైలిలో మార్పే కారణం

జీవన శైలిలో మార్పు రావడంతోనే ఇలాంటి రోగాలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మద్యం సేవించడం, ప్లాస్టిక్ వినియోగం, పొగాకు వినియోగం ఇలా ఒక్కటేమిటి పలు కారణాలతో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, ఆందోళన తలతో ఎక్కువ మంది మహిళలు హార్మోన్ల అసమతుల్యత, క్యాన్సర్, థైరాయిడ్ సమస్యల బారిన పడుతున్నారు. రక్త హీనత, విటమిన్ లోపం వంటి సమస్యలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నట్లు మహిళా ఆరోగ్య కేంద్రాల్లో చేస్తున్న పరీక్షల్లో వెలుగు చూస్తున్నాయి. మహిళల్లో ప్రధానంగా మానసిక ఆందోళన, ఒత్తిడి, నిద్రలేమి వంటి కారణాలతో శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి కొన్ని రకాల హార్మోన్లు లోపించి క్యాన్సర్ రావడానికి కారణమవుతున్నట్లు చెబుతున్నారు.

ఆందోళన అవసరం లేదు

వ్యాధుల బారిన పడిన మహిళలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సకాలంలో చికిత్స పొందితే రోగం తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం ప్రతి మంగళవారం వైద్య సేవలు అందుతున్నాయి. త్వరలో వారంలో రెండు రోజులు సేవలందుతాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత మహిళలు ఎలాంటి అనుమానాలకు, మూఢ నమ్మకాలకు పోయి ఇబ్బంది పడరాదు. మహిళా ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు చేసుకొని వైద్యుల సలహాలు పాటించాలి.

– డాక్టర్ పాల్వాన్ కుమార్, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పరిగి: రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందారు. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి గ్రామానికి చెందిన ఎండీ యూసుఫ్(53) గత నెల 27న పని నిమిత్తం పరిగి మండలం సయ్యాద్‌పల్లికి బైక్‌పై వెళ్లాడు. మార్గమధ్యలో రాఘవపూర్ సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి నగరంలోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి: ఇంట్లో అందరూ పండగకు ఏర్పాట్లు చేస్తుండగా రోడ్డు ప్రమాదంలో కుటుంబసభ్యుడు మృతి చెందడంతో విషాదం నెలకొంది. మండల పరిధిలోని సయ్యాద్‌పల్లి గ్రామానికి చెందిన పొట్టిగారి సత్తయ్య(36) శుక్రవారం ఉదయం గ్రామం నుంచి పని నిమిత్తం చిట్యాల గ్రామానికి బైక్‌పై వెళ్లాడు. మార్గమధ్యలో అభిరాం స్టీల్ ఫ్యాక్టరీ సమీపంలో స్టీల్ లోడ్ ఉన్న లారీ వేగంగా ఢీకొంది. దీంతో సత్తయ్య తలకు తీవ్ర రక్త గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి అనంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వాహనదారుడికి గాయాలు

పెద్దేముల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి (ఏపీ 28 డీజీ 7550) నంబరు కలిగిన ద్విచక్ర వాహనంపై తాండూరు నుంచి వికారాబాద్ వైపు వెళ్తున్నాడు. మండలంలోని చైతన్యనగర్ గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతని తలకు తీవ్ర గాయాలై రోడ్డుపై పడ్డాడు. గమనించిన వాహనదారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా తాండూరులోని ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. ఈ నెల 4వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో గోపన్‌పల్లిలోని వైన్‌షాపు వెనుక సిట్టింగ్ ప్రదేశంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్వశ్రీ కుమార్(55). ఎన్‌టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఐస్‌క్రీం బండి నిర్వహిస్తున్నాడు. వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి తాగి పడిపోయాడు. వైన్‌షాపు నిర్వాహకులు గమనించి గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బి.రాజు తెలిపిన వివరాల మేరకు.. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్పకు చెందిన అడెపు హేమంత్(24) కూరగాయల వ్యాపారి. ఆయన శుక్రవారం ఉదయం మార్కెట్‌కు బయలుదేరి ఐదు నిమిషాల్లోనే ఇంటికి తిరిగి వచ్చి గదిలోకెళ్లి గొళ్లెం పెట్టుకున్నాడు. తలుపు తెరిచేందుకు భార్య విఫలయత్నం చేసి తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా హేమంత్ చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అతడిని ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే హేమంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘రైతుబీమా’ కర్షకులకు ధీమా

మండలంలో 389మంది రైతు కుటుంబాలకు రూ.19.45 కోట్ల లబ్ధి

ఆరుగాలం శ్రమించి సిరులు పండించే అన్నదాతల కుటుంబాలకు ‘రైతుబీమా’ బాసటగా నిల్చింది. రైతు మృతి చెందితే కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం రూపంలో రూ.5 లక్షలు అందనున్నాయి. దీంతో తమకు ఈ పథకం కష్టకాలంలో ఆపన్నహస్తంగా తోడ్పడుతుందని లబ్ధిదారులు అంటున్నారు.



పొలంలో దుక్కి దున్నుతున్న రైతు (ఫైల్)

దౌల్తాబాద్: వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాల్లో రైతుబీమా తోడ్పాటునిస్తోంది. కుటుంబపెద్దను కోల్పోతే బాధితులకు రైతుబీమా పథకం ఆసరాగా నిలుస్తోంది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలోనూ కొత్త ప్రభుత్వం సైతం ఈ పథకాన్ని అమలు చేస్తూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుంది. 2018 ఆగస్టు 15న రైతుబీమా పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఈ పథకాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దస్త్రాలు ఉంటే చాలు

అన్నదాత ఏ కారణం చేతనైనా మృతిచెందితే వారి కుటుంబం వీధిన పడకుండా ఉండేందుకు ఈ పథకం దోహదపడుతుంది. బాధిత కుటుంబానికి రూ.5లక్షల చొప్పున పరిహారం అందుతోంది. దస్త్రాలు సరిగ్గా ఉంటే ఎలాంటి చిక్కులు లేకుండా బీమా పరిహారం వారంలోగా నామినీ ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయి. దీన్ని కొనసాగించేందుకు ఇటీవల బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించింది.

ఏడాది వారీగా మండలంలో రైతుబీమా వివరాలు

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	నిధులు (రూ.కోట్లలో)
2018	57	2.85
2019	43	2.15
2020	109	5.45
2021	75	3.75
2022	77	3.85
2023	28	1.40
మొత్తం	389	రూ.19.45 కోట్లు

అర్హతలు ఇలా..

- ఆధార్ యూఐడీఏ పోర్టల్ అనుసరించి రైతు వయసు 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఏటా ఆగస్టు 14 నుంచి మరుసటి సంవత్సరం ఆగస్టు 13 వరకు పథకం అమలులో ఉంటుంది.
- ఏటా నిర్ణీత సమయంలో రెన్యూవల్ చేయడం తప్పనిసరి.
- నిర్ణీత సమయంలో బీమా నమోదు చేసుకున్న రైతు ఏ విధంగా మరణించినా బాధిత కుటుంబానికి బీమా పరిహారం రూ.5లక్షలు అందుతుంది.
- నామినీ ఖాతాలో బీమా పరిహారాన్ని ఎల్‌ఐసీ జమ చేస్తుంది.

రూ.5 లక్షల సాయం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉన్న రైతులకు ఈ పథకం వర్తిస్తోంది. రైతు అకాల మరణం చెందితే ఆధార్‌కార్డు, మరణ ధ్రువ పత్రం, బ్యాంకు ఖాతాతో పాటు నామినీ పత్రాలు అందిస్తే రూ.5లక్షలు పరిహారం ఖాతాలో జమ అయ్యేలా వ్యవసాయశాఖ విస్తరణాధికారులు కార్యాచరణ రూపొందిస్తారు.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

- అండగా నిలిచిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్
- ‘సాక్షి’ కథనానికి స్పందన



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి నరేష్

బంట్వారం: ‘పేద కుటుంబానికి పెద్ద ఆపద’ అనే శీర్షికతో ‘సాక్షి’లో ఇటీవల ప్రచురితమైన కథనానికి ఓ ఫౌండేషన్ ప్రతినిధులు స్పందించారు. బాధిత కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని సల్బత్తాపూర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డి(26)కి రెండు కిడ్నీలు ఫెయిల్యూర్ అయ్యాయి. ఏడాది కాలంగా కుటుంబసభ్యులు ఆస్పత్రి ఖర్చులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయాన్ని ప్రచురితం చేయడంతో నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ స్పందించింది. ఆ సంస్థ ప్రతినిధి కర్నాటి నరేష్ శుక్రవారం సల్బత్తాపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. 240 మంది ఒక గ్రూప్‌గా ఏర్పడి లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఒక్కో సభ్యుడు నెలకు రూ.200 చొప్పున జమ చేస్తామన్నారు. వాటితో ఆపదలో ఉన్న వారిని గుర్తించి మూడేళ్లుగా తోచిన సహాయం అందిస్తున్నామన్నారు.

పన్నెండేళ్లుగా ‘ఇదే తీరు’



ఇరువర్గాలను సముదాయిస్తున్న పోలీసులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మెట్లకుంట శివారులోని శివాలయానికి దారి సమస్య పన్నెండేళ్ల నుంచి కొనసాగుతోంది. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం సాయంత్రం మళ్లీ తెరపైకి వచ్చింది. గ్రామ శివారులోని సర్వే నంబరు 10లో ఉన్న శివాలయానికి వెళ్లేదారిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పట్టా భూమి ఉంది. ఆలయానికి దారి ఇవ్వాలని గ్రామస్తులు కొన్నేళ్లుగా ఉద్యమిస్తున్నారు. పండగ సందర్భంగా ఆలయం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా సదరు కుటుంబీకులు అడ్డుకున్నారు. ఇది ఆందోళనలకు దారి తీయకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీహరిరెడ్డి, ఎస్‌ఐ ఎండీ రవూఫ్ శాంతియుతంగా సముదాయించి పంపారు.

దర్జాగా ఇసుక అక్రమ రవాణా



యాలాల: కాగ్నా నదిలో నుంచి ట్రాక్టరులో ఇసుక నింపుతున్న కూలీలు



పెద్దేముల్: పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్‌లు

పట్టించుకోని అధికారులు

యాలాల: మండల పరిధిలోని బెన్నూరు సమీపంలో కాగ్నా నది నుంచి శుక్రవారం దర్జాగా ఇసుక అక్రమ రవాణా సాగింది. కాగ్నా నది పంపుహౌస్ సమీపంలో నాలుగు ట్రాక్టర్లలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇసుకను తోడేశారు. ట్రాక్టర్లలో తాండూరు, అగ్గనూరు రూట్లలో ఇసుకను తరలించుకుపోయారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక రైతులు మీడియాకు సమాచారం ఇచ్చారు. కాగ్నా నది నుంచి ఇసుకను అటు పర్మిట్ల పేరుతో సెలవు రోజున అక్రమంగా తరలిస్తున్న మైన్స్, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ రవాణా జరుగుతున్న విషయాన్ని రెవెన్యూ అధికారులకు ఫోన్‌లలో సమాచారం ఇద్దామనుకుంటే అధికారులు స్పందించడం లేదని స్థానిక యువకులు వాపోతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దేముల్: మండలంలో అక్రమ ఇసుక దందా పెట్రేగిపోతుంది. ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. గురువారం రాత్రి అనుమతి లేకుండా ఆరు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకొని పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ గిరి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెగోండి శివారులోని వాగుల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఆరు ఇసుక ట్రాక్టర్‌లు లోడ్ చేసి వెళుతుండగా మంబాపూర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఏలాంటి అనుమతులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

పహాడీషరీఫ్: పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.26,500 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, రెండు సెట్ల పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మామిడిపల్లికి చెందిన జంగయ్య(46), రాజు(38), జగన్(48), శ్రీనివాస్ గౌడ్(32), మురళి(45), సిద్దులు(30), మల్లేష్(40), చెన్నయ్య(49), ఆశీర్వాదం(50) శుక్రవారం మధ్యాహ్నం మామిడిపల్లి శివారులోని అలీగూడంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మధు తన బృందంతో కలిసి దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

శివోహం పెయింటింగ్ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొన్న మహిళలు

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శివోహం పెయింటింగ్ పోటీలను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. మనోహర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలోని భక్తిని అనేక రకాలుగా చూపించవచ్చని అందులో భాగంగానే చిత్రకారులు పెయింటింగ్ రూపంలో చూపుతారన్నారు. వారిలోని కళను వెలుగులోకి తెచ్చి ప్రోత్సహించేందుకే యేటా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు 32 మంది కళాకారులు పాల్గొన్నారని, ఆదివారం వరకు కొనసాగుతాయన్నారు. చివరి రోజు ఉత్తమ పెయింటింగ్‌లకు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు రాంప్రతాప్, ఎన్. రామకృష్ణ, శివరామకృష్ణతో పాటు పెద్ద ఎత్తున కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా జంగయ్య



జంగయ్యకు నియామక పత్రం అందజేస్తున్న ఇటుక రాజు

షాద్‌నగర్: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చటాన్‌పల్లి గ్రామానికి చెందిన సింగపాగ జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో గురువారం రాత్రి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగపాగ జంగయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

పట్టణ సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్: భక్తుల దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్న జాతరలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శుక్రవారం సీఐ ప్రారంభించి మాట్లాడారు. భక్తుల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి దర్గా వెంకటేశ్, ఆవ జగన్, మహిపాల్‌రెడ్డి, సూర్య, కార్తీక్, శ్రీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న గడువు

- పీఏసీఎస్ రుణాల చెల్లింపునకు 30 తుదిగడువు
- రూ.49 కోట్ల బకాయిలకు గాను వసూలైంది రూ.4 కోట్లే
- మొండిబకాయిదారులకు హెచ్చరిక నోటీసులు
- స్పందించని వారి ఆస్తులు జప్తు చేస్తామని అధికారుల హెచ్చరిక



యాచారం పీఏసీఎస్ కార్యాలయం

యాచారం: పీఏసీఎస్‌లో రుణాలు పొందిన రైతులు బకాయిలు చెల్లించాలని అధికారులు కోరుతున్నారు. ఈనెల 30లోపు చెల్లించకపోతే అపరాధ రుసుం కట్టాల్సి వస్తుందని యాచారం పీఏసీఎస్ అధికారులు రైతుల వద్దకు వెళ్లి వివరిస్తున్నారు. ఓవైపు వసూలు లక్ష్యం గడువు ముంచుకొస్తుండటంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నిర్ణీత గడువులోపు కనీసం 60 శాతం బకాయిలు సేకరించని వారిపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు చెప్పడంతో క్షేత్రస్థాయిలో తిరుగుతూ రైతులను బతిమాలుతున్నారు.

రూ.70 కోట్లకు పైగా పంపిణీ..

యాచారం పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లో 2008 నుంచి 2022 వరకు 3,500 మందికి పైగా రైతులు దీర్ఘకాలిక రుణాల కింద రూ.70 కోట్లకు పైగా రుణాలు పొందారు. వీరంతా పౌల్ట్రీలు, డెయిరీ ఫాంలు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నారు. లోన్ తీసుకున్న సమయంలో రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాలు తాకట్టు పెట్టి ఒక్కొక్కరు సుమారు రూ.5 లక్షలకు పైగా రుణాలు పొందారు. వీరిలో కొంతమంది ఏటా మార్చి 30లోపు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తుండగా మరికొంత మంది నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదు.


టార్గెట్ రూ.27 కోట్లు

మార్చి 30లోపు అధికారులు కనిష్టంగా రూ.27 కోట్ల బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. టార్గెట్ గడువు దగ్గర పడుతున్నప్పటికీ రుణాల చెల్లింపుల్లో చలనం కనిపించడం లేదు. దీంతో అధికారుల్లో టెన్షన్ నెలకొంది. రెండు, మూడు నెలలుగా గ్రామాల్లో తిరుగుతున్నప్పటికీ కేవలం రూ.4 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. దీర్ఘకాలిక రుణాలు పొందిన వారిలో తుమ్మలోనిగూడ, చింతపట్ల, నల్లవెల్లి, చౌదర్‌పల్లి, నక్కర్తమేడిపల్లి, మంతన్‌గౌరెల్లి, యాచారం, మొండిగౌరెల్లి, మల్కీజ్‌గూడ, గునుగల్, చింతుల్ల తదితర గ్రామాల రైతులు అధికంగా ఉన్నారు. బకాయిదారుల్లో సైతం వీరే ముందువరుసలో కనిపిస్తున్నారు.

ఆస్తుల జప్తునకు రంగం సిద్ధం..

యాచారం పీఏసీఎస్‌లో 2008 నుంచి రైతులు పొందిన దీర్ఘకాలిక రుణాలు అపరాధ రుసుంతో కలిసి రెట్టింపయ్యాయి. 1,323 మంది రూ.49 కోట్ల వరకు రుణాలను పొందారు. ప్రస్తుతం కేవలం 300 మందికి పైగా రైతులు మాత్రమే రూ.4 కోట్ల వాయిదా బకాయిలు చెల్లించారు. ఇంకా 1,023 మంది రైతులు 45 కోట్ల బకాయిలు చెల్లించాలి. ఈ పక్షం రోజుల్లో వాయిదా బకాయిలు చెల్లిస్తే సరి లేదంటే మార్చి 30 తర్వాత మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి తాకట్టు పెట్టిన ఆస్తుల జప్తునకు అధికారులు రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో తిరిగినా రైతుల నుంచి స్పందన లేకపోవడం, మార్చి 30లోపు చెల్లిస్తామనే భరోసా ఇవ్వకపోవడం అధికారులు సీరియస్‌గా ఉన్నారు. రైతులు బకాయిలు చెల్లించకపోతే మాకేంటి నష్టం ..? రుణం కోసం మార్టిగేజ్ చేసిన వ్యవసాయ భూములను వేలం వేయడం కోసం హెచ్చరిక నోటీసులు ఇచ్చి జప్తు చేసుకుంటాం అంటున్నారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం



బకాయిలు చెల్లించేందుకు మార్చి 30 తుది గడువు. మూడు నెలలుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. రైతుల ఇళ్లు, పొలాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోతోంది. రూ.49 కోట్లకు గానూ కేవలం రూ.4 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. మొండి బకాయిదారుల ఆస్తుల జప్తునకు ఉన్నతాధికారులకు వివరాలు అందజేస్తాం.

– నాగరాజు, సీఈఓ, యాచారం పీఏసీఎస్

టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో సంబరాలు



రాజేంద్రనగర్ డీఎం శ్రీనాథ్‌ను సత్కరిస్తున్న ఎండీ సజ్జనార్

రాజేంద్రనగర్: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో కళాభవన్‌లో గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ 2023–24 సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్తమ సేవలందించి ప్రథమ స్థానంలో నిలిచిన రాజేంద్రనగర్ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ సంస్థ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా మెమోంటో, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఈ అవార్డు తన బాధ్యతను మరింతగా పెంచిందన్నారు.

నేడు సాయిరెడ్డిగూడలో మల్లన్న కల్యాణం

షాబాద్: లింగారెడ్డిగూడ పంచాయతీకి అనుబంధ గ్రామమైన సాయిరెడ్డిగూడలో శనివారం మల్లన్న కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. ఉదయం 12 గంటలకు బోనాల ఊరేగింపు, మధ్యాహ్నం మల్లన్న కల్యాణం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ సులోచన శేఖర్‌రెడ్డి తెలిపారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

రాజకీయ శాస్త్రవేత్త ప్రొ.జోయాహసన్



ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

రాయదుర్గం: మహిళా సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త జేఎన్‌యూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ జోయాహసన్ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆరవ అంతర్జాతీయ ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా ప్రత్యేక సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా ‘కౌంట్ హర్ ఇన్: జెండర్ ఈక్వాలిటీ త్రూ ఎంపవర్‌మెంట్’ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. మహిళలను ప్రోత్సహిస్తే తమ సత్తా చాటుతారని అన్నారు. ఏఎంయూ డైరెక్టర్ ట్రిబాక్ న్యూఢిల్లీ మాజీ ప్రొఫెసర్ అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం ద్వారా మహిళా సాధికారత జరుగుతుందన్నారు. హెచ్‌సీయూ సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్, హిస్టరీ విభాగం ప్రొఫెసర్ రేఖా పాండే మాట్లాడారు. కార్యక్రమంలో జేఎన్‌యూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, మనూ ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షుగుఫ్తా షాహీన్, మనూ ఎకనామిక్స్ గౌరవ ప్రొఫెసర్ అమితాబ్ కుందు, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు ప్రొ.అమీరుల్లాఖాన్, మాజీ వీసీ ప్రొ. రహమతుల్లా, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, కో కన్వీనర్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ముస్తాజాబ్ ఖతీర్ ప్రసంగించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సీఎం రేవంత్‌రెడ్డికి శాలువ కప్పి సన్మానిస్తున్న వెంకట్‌రెడ్డి

షాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు హైతాబాద్ ఎంపీటీసీ పొన్న జయమ్మ వెంకట్‌రెడ్డి తెలిపారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.